సాక్షి
శ్రీసత్యసాయి జిల్లా

బుధవారం : 2 : అక్టోబర్ : 2024



చీనీ టన్ను రూ.19 వేలు
అనంతపురం మార్కెట్‌యార్డులో మంగళవారం చీనీకాయలు టన్ను గరిష్ట ధర రూ.19 వేలు పలికాయి. కనిష్టం రూ 9 వేలు, సరాసరి రూ.15 వేల ప్రకారం విక్రయాలు జరిగాయి.



బీజేపీ నాయకులపై కేసు
ధర్మవరంలోని ఫ్లంబర్ల ఇళ్ల నిర్మాణాలను ధ్వంసం చేయించిన బీజేపీ నాయకులపై పోలీసులు మంగళవారం కేసు నమోదు చేశారు. 10లో

గరిష్టం/కనిష్టం
36.8°/21.9°

జిల్లా పరిధిలో మంగళవారం ఉష్ణోగ్రతలు స్థిరంగా నమోదయ్యాయి. ఉక్కపోత పెరిగింది. ఆకాశం పాక్షికంగా మేఘావృతమై అక్కడక్కడా తేలికపాటి వర్షం కురిసింది. నైరుతి దిశగా గంటకు 6 నుంచి 10 కిలో మీటర్ల వేగంతో గాలులు వీచాయి.

న్యూస్‌రీల్

రేపటి నుంచి శరన్నవరాత్రి ఉత్సవాలు



ప్రత్యేక అలంకరణలో ఖాద్రీశుడు

కదిరి టౌన్: శ్రీఖాద్రీ లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో ఈ నెల మూడో తేదీ నుంచి దసరా శరన్నవరాత్రి ఉత్సవాలు నిర్వహించనున్నట్లు ఆలయ ఈఓ వి.శ్రీనివాసరెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. మూడో తేదీన మత్స్యావతార, నాలుగున కూర్మావతారం, ఐదున నృసింహావతార, ఆరున రామావతారం, ఏడున కృష్ణావతార, ఎనిమిదిన పరమపదనాథ, తొమ్మిదిన సరస్వతీ అలంకారం, పదిన మోహినీ, 11వ తేదీన వేంకటేశ్వరస్వామి అలంకారంలో భక్తులకు దర్శనమిస్తారని పేర్కొన్నారు. భక్తులు ఉత్సవాల్లో పాల్గొనాలని కోరారు.

త్వరితగతిన ‘ఫ్రీహోల్డ్’ భూముల పరిశీలన

ప్రశాంతి నిలయం: జిల్లాలో ఫ్రీహోల్డ్ భూముల రికార్డుల వెరిఫికేషన్ ప్రక్రియను త్వరితగతిన పూర్తి చేస్తామని కలెక్టర్ చేతన్ తెలిపారు. మంగళవారం అమరావతి సీసీఎల్‌ఏ కార్యాలయం నుంచి రెవెన్యూ మంత్రి అనగాని సత్యప్రసాద్ ఫ్రీహోల్డ్ భూముల పరిశీలన, ప్రజల నుంచి వచ్చిన అర్జీలకు పరిష్కారం, సుమోటో క్యాస్ట్ వెరిఫికేషన్ అంశాలపై జిల్లా కలెక్టర్లతో సమీక్షించారు. కార్యక్రమంలో రెవెన్యూ శాఖ స్పెషల్ సీఎస్ పీఆర్ సిసోడియా, సెక్రెటరీ జయలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు. రెవెన్యూ మంత్రి మాట్లాడుతూ, సీఎంఓ, రెవెన్యూ మంత్రి కార్యాలయం నుంచి వచ్చిన వినతులపై వెంటనే స్పందించాలన్నారు. గ్రీవెన్స్ ఎప్పటికప్పుడు జీరో స్థాయికి తీసుకురావాలన్నారు. స్పందించిన కలెక్టర్ టీఎస్ చేతన్ మాట్లాడుతూ జిల్లాలో త్వరితగతిన ఫ్రీహోల్డ్ భూముల వెరిఫికేషన్ పూర్తి చేస్తామన్నారు. ప్రజల నుంచి వచ్చే వినతులు పరిష్కరించేందుకు ప్రత్యేక వ్యవస్థ ఏర్పాటు చేసినట్లు చెప్పారు. కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ అభిషేక్ కుమార్, డీఆర్‌ఓ కొండయ్య, పెనుకొండ, పుట్టపర్తి, ధర్మవరం, కదిరి ఆర్డీఓలు ఆనంద్, భాగ్యరేఖ, మహేష్, వంశీకృష్ణ, డిప్యూటీ కలెక్టర్లు పాల్గొన్నారు.

నవోదయలో ప్రవేశానికి దరఖాస్తుల ఆహ్వానం

లేపాక్షి: లేపాక్షి జవహర్ నవోదయ విద్యాలయంలో 2025–26 విద్యాసంవత్సరానికి గాను తొమ్మిదో తరగతి, 11వ తరగతిలో ప్రవేశానికి అర్హులైన విద్యార్థులు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపాల్ నాగరాజు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రవేశ పరీక్ష 2025 ఫిబ్రవరి 8న జరుగుతుందని పేర్కొన్నారు. ఈ నెల రెండో తేదీ నుంచి 30వ తేదీలోపు దరఖాస్తు చేసుకోవాలని, ప్రవేశ పరీక్షకు ఎటువంటి రుసుమూ చెల్లించనవసరం లేదని తెలిపారు. ఉమ్మడి అనంతపురం జిల్లా విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

నేడు కప్పలబండలో స్వచ్ఛ భారత్ దివస్

ప్రశాంతి నిలయం: జాతిపిత మహాత్మా గాంధీ జయంతి సందర్భంగా బుధవారం పుట్టపర్తి మండలం కప్పలబండలో స్వచ్ఛ భారత్ దివస్ నిర్వహించనున్నట్లు జిల్లా ప్రోగ్రాం అధికారి తెలిపారు. ఈ మేరకు ఆయన మంగళవారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఉదయం 10 గంటలకు కార్యక్రమం ప్రారంభమవుతుందని, కలెక్టర్ చేతన్ హాజరవుతారని తెలిపారు. జిల్లా అధికారులందరూ కార్యక్రమంలో పాల్గొనాలని కోరారు.

టమాట కిలో రూ.60



అనంతపురం అగ్రికల్చర్: స్థానిక కక్కలపల్లి మండీలో మంగళవారం టమాట కిలో రూ.60తో అమ్ముడుపోయింది. జూలై, ఆగస్టుతో పోల్చుకుంటే సెప్టెంబర్‌లో పంట కోతలు తగ్గిపోయాయి. అక్టోబర్‌లో కూడా అంతంత మాత్రంగానే ఉండవచ్చని చెబుతున్నారు. దీంతో కక్కలపల్లి మండీకి ఇటీవల కాలంలో టమాటా తక్కువగా వస్తోంది. సరుకు తగ్గడంతో ధరలు క్రమేపి పెరుగుతున్నాయి. గత 15 రోజులుగా కిలో టమాట రూ.30 నుంచి రూ.45 వరకు పలికింది. మంగళవారం మరోసారి ధర అమాంతంగా పెరిగి రూ.60కి చేరుకుంది. మంగళవారం మార్కెట్‌లో 900 టన్నుల క్రయ విక్రయాలు జరిగాయి. ఇందులో నాణ్యమైన టమాట 15 కిలోల బాక్సు గరిష్ఠంగా రూ.900 పలికింది. అలాగే కనిష్ఠ ధర రూ.30, సరాసరి ధర రూ.45తో అమ్ముడుపోయాయి.



లగేజీతో బస్టాండ్‌కు చేరుకున్న విద్యార్థులు



అనంతపురం ఆర్టీసీ బస్టాండ్‌లో బస్సుల కోసం వేచి ఉన్న విద్యార్థులు

ఊరికెళదాం.. పండగ చేద్దాం

పుట్టపర్తి: విద్యాశాఖ దసరా సెలవులు ప్రకటించింది. బుధవారం గాంధీ జయంతిని కలుపుకొని 13వ తేదీ వరకు పండుగ సెలవులు ఇచ్చింది. మామూలుగా అయితే 11 రోజులే. గాంధీ జయంతిని కలుపుకుంటే సెలవుల సంఖ్య 12కు చేరింది. ఈ నెల 14న పాఠశాలలు పునఃప్రారంభమవుతాయి. ఉమ్మడి అనంతపురం జిల్లాతో పాటు రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల్లో చదువుకుంటున్న విద్యార్థులు పండుగ సెలవులకు స్వస్థలాలకు పయనమయ్యారు. మంగళవారం ఆర్టీసీ బస్టాండ్లు, రైల్వే స్టేషన్లలో విద్యార్థుల సందడి నెలకొంది. సంతోషంగా ఇళ్లకు బయల్దేరారు.



బస్సులో సీటు కోసం పాట్లు

కోడిగుడ్డు.. అందితే ఒట్టు

- మధ్యాహ్న భోజనంలో కనిపించని మెనూ
- 15 రోజులుగా గుడ్డుకు నోచుకోని విద్యార్థులు
- సకాలంలో బిల్లులు రాక.. ఆగిన సరఫరా
- పట్టించుకోని విద్యాశాఖ అధికారులు



పుట్టపర్తి: ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు మధ్యాహ్న భోజనంలో కోడిగుడ్డు అందడం లేదు. రెండు వారాలుగా పౌష్టికాహారానికి దూరమయ్యారు. గత వైఎస్సార్‌సీపీ పాలనలో ప్రభుత్వ బడుల రూపురేఖలు మారాయి. మౌలిక సదుపాయాలు మెరుగుపరిచారు. విద్యార్థుల ఆరోగ్యం, హాజరుశాతం పెంచేందుకు పోషక పదార్థాలైన కోడిగుడ్లు, చిక్కీలను మధ్యాహ్న భోజనంతో పాటు చేర్చి అందించారు. శ్రీసత్యసాయి సెంట్రల్ ట్రస్టు సహకారంతో రాగిమాల్ట్ కూడా ఇచ్చేవారు. కరోనా విపత్తు వేళ.. సెలవుల సమయంలోనూ విద్యార్థులకు ఇళ్లకే కోడిగుడ్లు, చిక్కీలు పంపిణీ చేశారు. అయితే కూటమి ప్రభుత్వం వచ్చాక ప్రభుత్వ పాఠశాలలను నిర్లక్ష్యం చేసింది. జిల్లా వ్యాప్తంగా అన్ని యాజమాన్యాల కింద 2,011 పాఠశాలలు ఉన్నాయి. ఇందులో 1,25,881 మంది విద్యార్థులు చదువుకుంటున్నారు. విద్యార్థులకు 15 రోజులుగా కోడిగుడ్లు అందలేదు. దీంతో విద్యార్థులలో పోషక లోపం ఏర్పడే పరిస్థితి నెలకొందని విద్యార్థుల తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అయితే స్కూల్ మేనేజ్‌మెంట్ కమిటీలు కూడా దీనిపై స్పందించకపోవడం గమనార్హం. విద్యాశాఖ అధికారులు అయితే పాఠశాలల్లో మెనూ అమలవుతోందా.. లేదా.. అన్నది పర్యవేక్షించడం లేదన్న విమర్శలు ఉన్నాయి. కాంట్రాక్టర్లకు సకాలంలో బిల్లులు అందకపోవడంతో కోడిగుడ్ల సరఫరా ఆగిపోయింది.



మధ్యాహ్న భోజనం తింటున్న బాలికలు

ఇప్పుడెందుకో ఇవ్వడం లేదు



గత ఏడాది వరకు సెలవుల్లో కూడా కోడిగుడ్లు, చిక్కీలు ఇళ్లకు పంపించారు. మంచి పోషక విలువలతో కూడుకున్న ఆహారం లభించింది. ఈ విద్యా సంవత్సరంలో సెలవుల్లో గుడ్లు ఇవ్వడం లేదు.

– భవ్యశ్రీ, 10వ తరగతి విద్యార్థిని, జెడ్పీ ఉన్నత పాఠశాల, ఓడీ చెరువు

స్టాకు రాలేదట



ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులకు గత సంవత్సరం సెలవు దినాల్లోనూ కోడిగుడ్లు ఇళ్లకు పంపించారు. ప్రస్తుతం కూడా అదే విధంగా పంపిస్తారనుకున్నాం. కానీ స్టాకు రాలేదని స్కూలులో మధ్యాహ్న భోజనంలో కూడా కోడిగుడ్లు ఇవ్వడం లేదు.

– సాదిక్, విద్యార్థి, జెడ్పీ ఉన్నత పాఠశాల, ఓడీచెరువు

ఎక్కడా ఫిర్యాదు రాలేదు



ప్రభుత్వ పాఠశాలల్లో కోడిగుడ్లు, చిక్కీలు క్రమం తప్పకుండా అందిస్తున్నాం. జిల్లాలో గుడ్లు అందలేదని ఏ ఒక్క పాఠశాల నుంచి కానీ, విద్యార్థులు, తల్లిదండ్రుల నుంచి కానీ ఫిర్యాదు రాలేదు. ఒక వేళ గుడ్లు అందలేదని సమాచారం అందితే చర్యలు తీసుకుంటాం.

– మీనాక్షి, డీఈఓ

ఓటరు జాబితా సవరణ 99.32 శాతం పూర్తి



వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న కలెక్టర్ చేతన్, జాయింట్ కలెక్టర్ అభిషేక్ కుమార్

ప్రశాంతి నిలయం: జిల్లాలో సంక్షిప్త ఓటరు జాబితా సవరణ ప్రక్రియ 99.32 శాతం పూర్తయినట్లు కలెక్టర్ టీఎస్ చేతన్ తెలిపారు. మంగళవారం రాష్ట్ర ఎన్నికల కమిషన్ సీఈఓ వివేక్ యాదవ్ అమరావతి నుంచి అన్ని జిల్లాల కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. పుట్టపర్తి కలెక్టరేట్ వీడియో కాన్ఫరెన్స్ హాలులో కలెక్టర్ చేతన్, జాయింట్ కలెక్టర్ అభిషేక్ కుమార్ పాల్గొన్నారు. కలెక్టర్ మాట్లాడుతూ జాబితాలో సవరణ కోసం 14,08,524 దరఖాస్తులు అందాయన్నారు. ఫారం 6 కింద 1,57,366 అందగా 23,304 తిరస్కరణకు గురయ్యాయని, 1,31,661 దరఖాస్తుల పరిశీలన పూర్తయిందని చెప్పారు. 2401 పెండింగ్‌లో ఉన్నాయన్నారు. ఫారం–7 కింద 1,06,391 అందాయని, అందులో 19,475 దరఖాస్తులు తిరస్కరణకు గురయ్యాయని, 84,742 పరిశీలన పూర్తయిందని వెల్లడించారు. 2,174 దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నాయన్నారు. ఫారం–8 కింద 93,086 దరఖాస్తులు అందాయని, 7,225 పెండింగ్‌లో ఉన్నాయని, 83,295 పరిశీలించామని వివరించారు. 2,566 దరఖాస్తులు తిరస్కరించినట్లు తెలిపారు. పెండింగ్ దరఖాస్తులను వారంలోపు పరిష్కరిస్తామన్నారు. కార్యక్రమంలో డీఆర్‌ఓ కొండయ్య, ఎన్నికల విభాగపు డిప్యూటీ తహసీల్దార్ మైనుద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

జిల్లా ఆస్పత్రి సూపరింటెండెంట్‌గా లింగన్న

హిందూపురం టౌన్: హిందూపురం జిల్లా ప్రభుత్వ ఆస్పత్రి నూతన సూపరింటెండెంట్‌గా డాక్టర్ లింగన్న నియమితులయ్యారు. ఈ మేరకు డీసీహెచ్ఎస్ తిపేంద్రనాయక్ మంగళవారం రాత్రి ఉత్తర్వులు జారీ చేశారు. ప్రస్తుత సూపరింటెండెంట్ డాక్టర్ రోహిల్ కుమార్ తన బాధ్యతలను సీనియర్ డాక్టర్ లింగన్నకు అప్పగించాలని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. ఇదిలా ఉండగా ‘జిల్లాస్పత్రిలో ముదిరిన వైద్యుల వివాదం’ శీర్షికన ‘సాక్షి’లో ప్రచురితమైన కథనానికి స్పందించిన వైద్యులు, సూపరింటెండెంట్ రోహిల్ కుమార్ మంగళవారం సమావేశమయ్యారు. సీనియర్ వైద్యులను కాదని జూనియర్ అయిన డాక్టర్ రోహిల్ కుమార్‌ను వైద్యవిధాన పరిషత్ ఉన్నతాధికారులు ఇదివరకు నియమించారు. ఈ నిర్ణయంపై పలువురు సీనియర్ వైద్యులు అభ్యంతరం వ్యక్తం చేస్తూ ఉన్నతాధికారులకు ఫిర్యాదులు చేశారు. సూపరింటెండెంట్ తీరు నచ్చకపోవడంతో సీనియర్ వైద్యుల మధ్య వివాదానికి దారి తీసింది. ఈ నేపథ్యంలో వైద్యులు సమావేశంలో పలు విషయాలపై చర్చించుకున్నారు. రోగులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా వైద్యసేవలందాలని వైద్యులు నిర్ణయించారు.

వైఎస్సార్‌సీపీ బలోపేతానికి కృషి



మాట్లాడుతున్న ఉషశ్రీచరణ్

- పార్టీ జిల్లా అధ్యక్షురాలు ఉషశ్రీచరణ్

సోమందేపల్లి: వైఎస్సార్‌సీపీని గ్రామస్థాయి నుంచి మరింత బలోపేతం చేసేందుకు కృషి చేస్తామని ఆ పార్టీ జిల్లా అధ్యక్షురాలు ఉషశ్రీచరణ్ తెలిపారు. మంగళవారం తుంగోడు గ్రామంలో వైఎస్సార్‌సీపీ కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఉషశ్రీచరణ్ మాట్లాడుతూ కూటమి అధికారంలోకి వచ్చి నాలుగు నెలలు కావస్తున్నా నేటికీ సూపర్ సిక్స్ పథకాలను అమలు చేయలేదన్నారు. మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ హయాంలో క్యాలెండర్ ప్రకారం పథకాలు అమలు చేసి లబ్ధిదారుల ఖాతాల్లో డబ్బులు జమ చేశారన్నారు. బీసీ సంక్షేమ శాఖ మంత్రిగా ఉన్న సవిత కనీసం బీసీలకు ఇచ్చిన హామీలను నెరవేర్చడంలో విఫలమయ్యారని విమర్శించారు. నేతన్న నేస్తం పథకం డబ్బులు అడిగిన చేనేత వర్గాలతో ‘తాగడానికి డబ్బులు ఇవ్వాలా’ అంటూ అవమానకరంగా మాట్లాడారన్నారు. ఇచ్చిన హామీలను నెరవేర్చాకుండా ఇసుక అక్రమ రవాణా, మద్యం పేరిట డబ్బు దోచుకోవడానికి టీడీపీ నాయకులు సిద్ధమవుతున్నారని ధ్వజమెత్తారు. వైఎస్సార్‌సీపీ శ్రేణులపై అక్రమ కేసులు బనాయించాలని చూస్తే ఉద్యమం తప్పదని హెచ్చరించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ గజేంద్ర, జెడ్పీటీసీ సభ్యుడు అశోక్, వైస్ ఎంపీపీ వెంకట నారాయణరెడ్డి, సర్పంచ్ జిలాన్‌ఖాన్, సీనియర్ నాయకుడు రమాకాంత్‌రెడ్డి, కో ఆప్షన్ సభ్యుడు రఫిక్, నాయకులు ప్రతాప్‌రెడ్డి, ఓబుల్‌రెడ్డి, శ్రీనాథ్ తదితరులు పాల్గొన్నారు.

‘మద్యం’ దరఖాస్తులకు వేళాయె

జిల్లాలో 87 దుకాణాలకు నోటిఫికేషన్

- దరఖాస్తుల స్వీకరణకు 9వ తేదీ తుది గడువు
- 11న లాటరీ ద్వారా లైసెన్స్‌ల కేటాయింపు
- 12 నుంచి కొత్త దుకాణాలు ప్రారంభం

కదిరి: నూతన మద్యం విధానాన్ని రాష్ట్ర ప్రభుత్వం ఖరారు చేసింది. రెండు సంవత్సరాల కాల పరిమితితో అనగా ఈ నెల 12 నుంచి 2026 సెప్టెంబర్ 30 వరకు ఈ విధానం అమలులో ఉంటుంది. జిల్లా వ్యాప్తంగా మొత్తం 87 మద్యం దుకాణాలకు జిల్లా ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ సూపరింటెండెంట్ ఎస్.గోవిందునాయక్ నోటిఫికేషన్ విడుదల చేశారు. ధర్మవరం ఎక్సైజ్ స్టేషన్ పరిధిలో దుకాణాలకు గెజిట్ వరుస సంఖ్య 1–20, సీకేపల్లి పరిధిలో 21– 25, పెనుకొండ, ధర్మవరం పరిధిలో 26–38, పుట్టపర్తి పరిధిలో 39–48, హిందూపురం పరిధిలో 49–59, కదిరి పరిధిలో 60–71, తనకల్లు పరిధిలో 72–77, మడకశిర ఎక్సైజ్ స్టేషన్ పరిధిలో 78–87 గెజిట్ సంఖ్య వరకు దుకాణాల కోసం దరఖాస్తు చేసుకోవచ్చు. మరింత సమాచారం కోసం పుట్టపర్తి ఉజ్వల ఫౌండేషన్ అపార్టుమెంట్‌లో ఉన్న జిల్లా ప్రొహిబిషన్, ఎక్సైజ్ కార్యాలయంలో ఇన్‌స్పెక్టర్ హరికృష్ణ ఆధ్వర్యంలో సెల్ నంబర్ 99634 42016తో కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేశారు. ఆసక్తి గలవారు తొమ్మిదో తేదీలోపు దరఖాస్తు చేసుకోవచ్చు. మంగళవారం (1వ తేదీ) ఉదయం నుంచే దరఖాస్తుల ప్రక్రియ ప్రారంభమైంది. ఆన్‌లైన్ లేదా ఆఫ్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవచ్చు. ఒక వ్యక్తి ఎన్ని దరఖాస్తులైనా సమర్పించుకోవచ్చు. ఒక్కో దరఖాస్తు రుసుం రూ.2 లక్షలుగా ప్రభుత్వం నిర్ణయించింది. ఈ డబ్బు వాపసు ఇవ్వరు. డెబిట్, క్రెడిట్ కార్డుల ద్వారా లేదా బ్యాంకు చలానా ద్వారా దరఖాస్తు రుసుం చెల్లించాలి. డీడీ తీసుకుని నేరుగా ఎక్సైజ్ స్టేషన్లో సమర్పించాలి.



మద్యం దుకాణం

కలెక్టర్ నేతృత్వంలో లాటరీ

ఈ నెల 9 వరకు మద్యం దుకాణాలకు దరఖాస్తులను స్వీకరిస్తారు. కలెక్టర్ చేతన్ నేతృత్వంలో ఈ నెల 11న లాటరీ ప్రక్రియ చేపట్టి.. ఆ మరుసటి దినం అంటే 12వ తేదీ నుంచి లైసెన్స్‌దారులు లాటరీ ద్వారా దక్కించుకున్న కొత్త దుకాణాలను ప్రారంభించుకోవచ్చు. అంత వరకు ఎప్పటిలాగానే ప్రభుత్వం ఆధ్వర్యంలోనే దుకాణాలు కొనసాగుతాయి.

6 విడతల్లో లైసెన్స్ రుసుం చెల్లింపులు

లాటరీ ద్వారా మద్యం దుకాణాలకు లైసెన్స్ దక్కించుకున్న వారు తాము చెల్లించాల్సిన లైసెన్స్ రుసుం ఏడాదిలో 6 విడతల్లో చెల్లించవచ్చు. దీన్ని ఎక్సైజ్ సుంకంగా పేర్కొన్నారు. మద్యం అమ్మకాలపై లైసెన్స్‌దారుడికి 20 శాతం కమీషన్ ఇస్తారు. నగరపాలక సంస్థల్లో మినహా మిగిలిన ప్రాంతాల్లో మద్యం దుకాణాలను మోడల్ స్టోర్స్‌గా అప్‌గ్రేడ్ చేసుకునేందుకు నూతన మద్యం పాలసీలో అవకాశం కల్పించారు. అయితే ఇందుకు ఏడాదికి రూ.5లక్షల చొప్పున అదనంగా చెల్లించాల్సి ఉంటుంది.

లైసెన్స్ రుసుం రూ.50 లక్షలు - రూ.85 లక్షలు

మద్యం దుకాణాలు ఏర్పాటు చేసే ప్రాంత జనాభాను బట్టి ప్రభుత్వం మొత్తం నాలుగు శ్లాబ్‌లలో లైసెన్స్ రుసుం ఖరారు చేసింది. మొదటి సంవత్సరం 10 వేల లోపు జనాభా ఉన్న ప్రాంతాల్లో రూ.50లక్షలు, 10 వేల నుంచి 50 వేల మధ్య జనాభా ఉంటే రూ.55 లక్షలు, 50 వేల నుంచి 5 లక్షల మధ్య జనాభా ఉన్న ప్రాంతాల్లో రూ.65 లక్షలు, 5 లక్షల కంటే ఎక్కువ జనాభా ఉన్న ప్రాంతాల్లో రూ.85 లక్షలుగా లైసెన్స్ రుసుం నిర్ణయించారు. రెండో సంవత్సరం దీనికి అదనంగా మరో 10 శాతం లైసెన్స్ రుసుం చెల్లించాల్సి ఉంటుంది.

జిల్లాకు దక్కని ప్రీమియం స్టోర్

నూతన మద్యం పాలసీలో నోటిఫై చేసిన మద్యం దుకాణాలకు అదనంగా ఏపీలో 12 జిల్లాలకు ప్రీమియం స్టోర్‌లు కేటాయించారు. విజయవాడ, విశాఖపట్నం, రాజమహేంద్రవరం, గుంటూరు, కాకినాడ, నెల్లూరు, కర్నూలు, వైఎస్సార్ కడప, అనంతపురం జిల్లాల్లో వీటిని ఏర్పాటు చేసేందుకు అవకాశం కల్పించారు. అయితే సత్యసాయి జిల్లాకు ప్రీమియం స్టోర్ కేటాయించలేదు. ప్రభుత్వాలు మారినా ప్రీమియం స్టోర్‌కు 5 ఏళ్ల కాలపరిమితి ఉంటుంది. దీనికి లైసెన్స్ రుసుం ఏడాదికి రూ.కోటి చెల్లించాల్సి ఉంటుంది.

బీజేపీ నాయకులపై క్రిమినల్ కేసు నమోదు

ధర్మవరం అర్బన్: పట్టణంలోని ప్లంబర్ల ప్లాట్లను హిటాచీతో కూల్చిన ఘటనకు సంబంధించి బీజేపీ నాయకులు గొడుగు నాగరాజు, సోమశేఖర్, ఎం.నాగరాజు, మరో 8మందిపై పోలీసులు క్రిమినల్ కేసు నమోదు చేశారు. ఈ మేరకు ధర్మవరం వన్‌టౌన్ సీఐ నాగేంద్రప్రసాద్ మంగళవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. స్థానిక దేవి నర్సింగ్ హోమ్ ఎదురుగా సర్వే నంబర్ 650–2లో ఎలక్ట్రికల్ ప్లంబర్స్ అసోసియేషన్ వారికి గతంలో ఇంటి పట్టాలు ఇచ్చారు. అందులో నిర్మించిన పునాదులు, రేకులుషెడ్లు, పిల్లర్లను హిటాచీ వాహనంతో బీజేపీ నేతలు ధ్వంసం చేశారు. బాధితుల ఫిర్యాదు మేరకు బాధ్యులైన బీజేపీ నేతలపై క్రిమినల్ కేసు నమోదు చేసి, కొందరిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు.

వృద్ధురాలి బలవన్మరణం


బావిలో నుంచి మృతదేహాన్ని బయటకు తెస్తున్న బంధువులు

విడపనకల్లు: బావిలోకి దూకి ఓ వృద్ధురాలు ఆత్మహత్య చేసుకుంది. స్థానికులు తెలిపిన మేరకు... విడపనకల్లుకు చెందిన బుడుగుల నారాయణమ్మ (73) కొంత కాలంగా క్యాన్సర్‌తో బాధపడుతోంది. బంధువులు చికిత్స చేయిస్తున్నా ప్రయోజనం లేకపోయింది. రోజూ కడుపునొప్పితో బాధపడుతున్న ఆమె మంగళవారం ఉదయం తన పింఛన్ సొమ్ము తీసుకెళ్లి కుటుంబసభ్యులకు ఇచ్చి తిరిగి బయటకు వచ్చింది. వెళ్లింది. రోజు మాదిరిగానే బయటకు వెళ్ళి ఉంటుందని బంధువులు అనుకున్నారు. అయితే ఆమె నేరుగా గ్రామ శివారులోని పురాతన గౌరమ్మ బావి వద్దకు చేరుకుని ఎవరూ లేని సమయంలో దూకింది. గమనించిన చుట్టుపక్కల పొలాల్లోని రైతులు వెంటనే బావిలోకి దూకి ఆమె కోసం గాలించి వెలికి తీసేలోపు మృతి చెందింది. ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు.

పంటలన్నీ పాయే!

- సకాలంలో కురవని వర్షాలతో దెబ్బతిన్న ఖరీఫ్ పంటలు
- 319.6 మి.మీ గానూ 431.3 మి.మీ వర్షపాతం
- 33 రెయినీడేస్... 80 వరకు డ్రైస్పెల్స్ నమోదు


అక్కంపల్లి వద్ద చేపట్టిన పంట కోత ప్రయోగంలో ఎకరాకు ఒక క్వింటా దిగుబడి కూడా లేదంటున్న అధికారులు


ఆత్మకూరులో చెట్టుకు కనిపిస్తున్న ఒకట్రెండు వేరుశనగ కాయలు

అనంతపురం అగ్రికల్చర్: జిల్లాలో వర్షం ఎక్కువగానే కురిసినా... పంట మాత్రం చేతికి దక్కకుండా పోయింది. ఇది మంగళవారంతో ముగిసిన ఈ ఖరీఫ్ పరిస్థితి. సకాలంలో కాకుండా అవసరం లేని సమయంలో వర్షాలు పడడంతో సాగు విస్తీర్ణం, పంట దిగుబడులు గణనీయంగా తగ్గాయి. ఏటా జూన్ 1 నుంచి సెప్టెంబర్ 30 వరకు ఉన్న పంట కాలాన్ని ఖరీఫ్‌గా పరిగణిస్తారు. జిల్లాకు సంబంధించి రైతులకు ఈ ఖరీఫ్ ఎంతో కీలకమైన సీజన్. నైరుతి రుతుపవనాల ప్రభావంతో ఖరీఫ్ నాలుగు నెలల కాలంలో 319.6 మి.మీ సాధారణ వర్షపాతం నమోదు కావాల్సి ఉంది. అయితే ఈ సారి 34.9 శాతం అధికంగా 431.3 మి.మీ నమోదైనా... రైతులకు పెద్దగా ఫలితం లేకుండా పోయింది.

ముందే పలకరించిన నైరుతి

గతానికి భిన్నంగా నైరుతి రుతుపవనాలు ఈ ఏడాది జూన్ 2వ తేదీనే జిల్లాను పలకరించాయి. గతంలో సాధారణంగా జూన్ మొదటి వారం తర్వాత కానీ పలకరించిన దాఖలాలు లేవు. రుతుపవనాలు జిల్లాను తాకగానే వర్షాలు కూడా మొదలయ్యాయి. జూన్ 14 వరకు జిల్లా అంతటా విస్తారంగా వర్షాలు కురిశాయి. జూన్ నెలంతా కలిపి సాధారణ వర్షపాతం 61 మి.మీ కాగా, కేవలం 15 రోజుల్లోనే ఏకంగా 143 మి.మీ వర్ష పాతం నమోదు కావడం గమనార్హం. అయితే జూన్ 14న ఆగిపోయిన వర్షాలు నెలన్నర రోజుల పాటు పత్తా లేకుండా పోయాయి. జూన్ 15న ఖరీఫ్ ఏరువాక మొదలు కాగా, జూలై నెలాఖరు వరకూ ప్రధాన పంటల సాగుకు అనుకూలమైన కీలక సమయంలో తీవ్ర వర్షాభావ పరిస్థితులు నెలకొన్నాయి. జూలైలో సాధారణ వర్షపాతం 63.9 మి.మీటర్లకు గానూ 61.8 శాతం తక్కువగా కేవలం 24.4 మి.మీ నమోదైంది. అప్పటికే అరకొర తేమలో అతి కష్టమ్మీద సాగు చేసిన పంటలు బాగా దెబ్బతిన్నాయి. అయితే ఆగస్టు మొదటి వారం, ఆ తర్వాత మూడోవారం మంచి వర్షాలు రావడంతో దెబ్బతిన్న పంటలు కొంత వరకు కోలుకుని ఆశలు రేకెత్తించాయి. ఆగస్టులో 83.8 మి.మీ గానూ 151.6 శాతం అధికంగా 210.8 మి.మీ వర్షపాతం నమోదైంది.

దెబ్బతీసిన సెప్టెంబర్

పంటల పరిస్థితి బాగానే ఉందని భావిస్తున్న తరుణంలో సెప్టెంబర్ వర్షాలు రైతాంగాన్ని కోలుకోలేని విధంగా దెబ్బతీశాయి. సెప్టెంబర్ నెల సాధారణ వర్షపాతం 110.9 మి.మీ కాగా 55.6 శాతం తక్కువగా 49.3 మి.మీ మాత్రమే నమోదైంది. మొత్తమ్మీద ఈ ఖరీఫ్‌లో సాధారణం కన్నా 34.9 శాతం అధికంగా వర్షపాతం నమోదైంది. నాలుగు నెలల కాలంలో 33 రెయినీడేస్ (వర్షపు రోజులు) నమోదు ఓ రికార్డు కాగా... జూన్ 14 నుంచి వర్షాభావ పరిస్థితులు నెలకొనడంతో 31 మండలాల పరిధిలో ఏకంగా 80 వరకు డ్రైస్పెల్స్ (21 రోజులు సరైన వర్షాలు లేకపోతే దానిని ఒక డ్రైస్పెల్ గా గుర్తిస్తారు) నమోదు కావడం విశేషం. ఇందులోనూ నాలుగైదు మండలాల్లో 40 నుంచి 50 రోజుల పాటు సుదీర్ఘ వర్షపాత విరామాలు నమోదయ్యాయి. పంట వేసిన జూలై నెలలో, పంటలన్నీ కీలకదశలో ఉన్న సెప్టెంబర్‌లో వర్షాలు మొహం చాటేయడంతో దిగుబడులపై ప్రభావం పడింది. చాలా ప్రాంతాల్లో వేరుశనగ ఎకరాకు కనీసం 2 క్వింటాళ్లు కూడా దిగుబడి రాని పరిస్థితి నెలకొంది. ఇదే విషయాన్ని పంట కోత ప్రయోగాలు స్పష్టం చేస్తున్నాయి. అలాగే ఆముదం ఒక విడత కోత రావచ్చని, పత్తి కూడా అంతంత మాత్రమేనని వ్యవసాయాధికారులు అంటున్నారు. ప్రస్తుతం కంది దిగుబడులపై రైతులు ఆశలు పెంచుకున్నా పూత రాలడం, వెర్రితెగులు ఆశించడంతో ఇది కూడా అంతంత మాత్రమేనని చెబుతున్నారు. మొత్తానికి సకాలంలో వర్షాలు కురవకపోవడంతో ఖరీఫ్ పంటలన్నీ బాగా దెబ్బతిన్నట్లు అధికారులు అంచనా వేశారు.

నెలాఖరు వరకూ వృద్ధుల మాసోత్సవం : డీఎంహెచ్‌ఓ


వైద్యసేవలు అందిస్తున్న వైద్యాధికారులు

పుట్టపర్తి అర్బన్: ఈ నెల మొత్తం జిల్లాలో వృద్ధుల మాసోత్సవాలను ఘనంగా నిర్వహించాలని వైద్య ఆరోగ్య సిబ్బందిని డీఎంహెచ్‌ఓ డాక్టర్ మంజువాణి ఆదేశించారు. ప్రపంచ వృద్ధుల దినోత్సవం సందర్భంగా మంగళవారం ఎనుములపల్లి వృద్ధాశ్రమంలో వృద్ధులకు వైద్యసేవలు నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా డీఎంహెచ్‌ఓ హాజరై, మాట్లాడారు. జిల్లాలోని ఆయుష్మాన్ ఆరోగ్య మందిర్, పీహెచ్‌సీలు, ఏరియా ఆస్పత్రులు, జిల్లాస్పత్రిలో ఈ ఏడాది నెల రోజుల పాటు వృద్ధుల మాసోత్సవాన్ని పక్కాగా నిర్వహించనున్నట్లు తెలిపారు. ఇందులో భాగంగా 60 సంవత్సరాలు పైబడిన వారికి బీపీ, షుగర్, మానసిక, పక్షవాతం స్క్రీనింగ్ టెస్టులు నిర్వహించి అవసరమైన మందులు అందజేస్తారన్నారు. ఇంటి వద్ద ఉన్న వృద్ధులు, బెడ్‌రెస్ట్‌లో ఉన్న వారికి ఇంటి వద్దకే వెళ్లి వైద్యం అందించేలా చర్యలు తీసుకున్నామన్నారు. అవసరమైతే ఇంటి వద్దే ఫిజియోథెరఫీ సేవలు అందిస్తామన్నారు. కార్యక్రమంలో డాక్టర్ నివేదిత, డాక్టర్ కుళ్లాయప్పనాయక్, డాక్టర్ తిప్పయ్య, డాక్టర్ నాగేంద్రనాయక్, బాలాజీ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

విద్యుదాఘాతంతో రైతు మృతి


మృతుడు కిష్టప్ప

సోమందేపల్లి: విద్యుత్ షాక్‌కు గురై ఓ రైతు మృతి చెందాడు. పోలీసులు తెలిపిన మేరకు... సోమందేపల్లి మండలం చాలకూరుకు చెందిన రైతు కిష్టప్ప (55) మంగళవారం ఉదయం మరకుంటపల్లి సమీపంలో ఉన్న తన పొలంలో వరి పంటకు నీరు పెట్టేందుకు వెళ్లాడు. అనంతరం మోటార్ ఆఫ్ చేసేందుకు వెళ్లిన సమయంలో స్టార్టర్ పెట్టెను తాకకగానే షాక్‌కు గురై అక్కడికక్కడే మృతి చెందాడు. ఆయనకు భార్య రామాంజనమ్మ, ముగ్గురు పిల్లలు ఉన్నారు. ఘటనపై కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టినట్లు ఎస్‌ఐ రమేష్‌బాబు తెలిపారు.

మున్సిపల్ కార్మికుడి అనుమానాస్పద మృతి


కొల్లారి (ఫైల్)

రాయదుర్గం టౌన్: స్థానిక మున్సిపాలిటీ పారిశుద్ధ్య కార్మికుడు కొల్లారి (43) అనుమానాస్పద స్థితిలో మృతి చెందాడు. ఔట్ సోర్సింగ్ విధానంలో పనిచేస్తున్న కొల్లారి... పాత మున్సిపల్ కార్యాలయంలో నైట్ వాచ్ మెన్‌గా పనిచేస్తున్నాడు. ఆదివారం నుంచి ఆయన కనిపించకపోవడంతో కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు పోలీసులు మిస్సింగ్ కేసు నమోదు చేసి, గాలింపు చేపట్టారు. ఈ క్రమంలో రాయదుర్గంలోని గౌడ నూతన హౌసింగ్ కాలనీలో నిర్మాణ దశలో ఉన్న ఓ కట్టడంలో మంగళవారం మధ్యాహ్నం కొల్లారి మృతదేహాన్ని స్థానికులు గుర్తించి సమాచారం ఇవ్వడంతో పోలీసులు అక్కడకు చేరుకుని పరిశీలించారు. విషయం తెలుసుకున్న మున్సిపల్ కార్మికులు, అధికారులు సైతం అక్కడకు చేరుకుని కొల్లారి మృతదేహాన్ని పరిశీలించారు. కాగా, కొల్లారి మృతిపై అనుమానాలు వ్యక్తం కావడంతో ఆ దిశగా పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు. కొల్లారికి ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. భార్య గతంలోనే మృతి చెందినట్లు బంధువులు తెలిపారు. ఓ వైపు మున్సిపల్ కార్మికుడిగా పనిచేస్తూనే అనేక షార్ట్ ఫిల్మ్‌లను ఆయన తీసేవాడు.

యువకుడి అనుమానాస్పద మృతి

ముదిగుబ్బ: మండలంలోని సీలంవారిపల్లి వద్ద మంగళవారం రాత్రి ద్విచక్రవాహనంపై వెళుతున్న అన్వేష్ (23) అనుమానాస్పద స్థితిలో మృతి చెందాడు. స్వగ్రామం తప్పెటవారిపల్లి నుంచి మలకవేమలక్రాస్‌కు ద్విచక్ర వాహనంలో వెళుతుండగా వాహనం అదుపు తప్పి కిందపడ్డాడా? లేక గుర్తు తెలియని వాహనం ఢీకొందా? అనేది తెలియాల్సి ఉంది. ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు.

కట్నం కోసం వేధిస్తున్నాడని కేసు

యాడికి: అదనపు కట్నం కోసం వేధిస్తున్నాడని వివాహిత ఫిర్యాదు మేరకు భర్తపై కేసు నమోదు చేసినట్లు పోలీసులు మంగళవారం తెలిపారు. యాడికి మండలం భోగాలకట్ట గ్రామానికి చెందిన చంద్రికకు ఏడాది క్రితం పెద్దపప్పూరు మండలం గార్లదిన్నె గ్రామానికి చెందిన చంద్రశేఖర్ రెడ్డితో వివాహమైంది. అదనపు కట్నం కావాలని భార్యతో ఆయన గొడవ పడుతుండేవాడు. ఆమె ఫిర్యాదు మేరకు భర్తపై కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

వినియోగదారులకు మెరుగైన సేవలు


ర్యాలీ నిర్వహిస్తున్న బీఎస్‌ఎన్‌ఎల్ ఉద్యోగులు, సిబ్బంది

అనంతపురం సిటీ: వినియోగదారులకు మెరుగైన సేవలందిస్తామని బీఎస్‌ఎన్‌ఎల్ ఉమ్మడి జిల్లా జనరల్ మేనేజర్ షేక్ ముజీబ్ పాషా తెలిపారు. బీఎస్ఎన్ఎల్(భారత్ సంచార్ నిగమ్ లిమిటెడ్) ఆవిర్భవించి పాతికేళ్లు పూర్తయిన సందర్భంగా నగరంలో ఆ శాఖ ఉద్యోగులు, సిబ్బంది ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా బీఎస్ఎన్ఎల్ 4జీ సేవలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో డీజీఎం బాలగంగాధరరెడ్డి, ఇతర విభాగాల అధికారులు, ప్రొవైడర్లు పాల్గొన్నారు.

ఏపీజీబీ ద్వారా విరివిగా రుణాలు

- ఏపీజీబీ రీటైల్ పండుగ రుణమేళాలో ఆర్‌ఎం శ్రీదేవి


రుణమేళాను ప్రారంభిస్తున్న ఆర్‌ఎం శ్రీదేవి, తదితరులు

అనంతపురం అగ్రికల్చర్: అన్ని వర్గాల అభ్యున్నతికి, అన్ని రంగాల పురోగతికి ఆంధ్ర ప్రగతి గ్రామీణ బ్యాంకు (ఏపీజీబీ) ద్వారా విరివిగా రుణాలు ఇస్తున్నట్లు ఆ బ్యాంకు రీజనల్ మేనేజర్ (ఆర్‌ఎం) శ్రీదేవి తెలిపారు. మంగళవారం స్థానిక ఆ బ్యాంక్ ప్రాంతీయ కార్యాలయంలో బ్యాంకు రీటైల్ పండుగ రుణమేళా కార్యక్రమాన్ని ఆమె ప్రారంభించి, మాట్లాడారు. ఈ నెల 1 నుంచి డిసెంబర్ 31 వరకు కొత్తగా 333 రోజుల ప్రగతి త్రివేణి డిపాజిట్ పథకాన్ని అమలు చేస్తున్నట్లు తెలిపారు. ఈ డిపాజిట్లపై 7.45 శాతం నుంచి 8.25 శాతం వడ్డీరేట్లు వర్తిస్తాయన్నారు. మరో వైపు 444 రోజుల ప్రగతి కుబేర్ డిపాజిట్ పథకం కూడా అమలులో ఉంటుందన్నారు. ఇదిలా ఉండగా వరుస పండుగల శుభవేళ ప్రజల సొంత ఇంటి కలను నెరవేర్చుకోవడం, గృహ, వాహన, తనఖా రుణాలకు ప్రత్యేకమైన వడ్డీ రాయితీతో పాటు ప్రాసెసింగ్ ఛార్జీల మినహాయింపు ఉంటుందన్నారు. అలాగే విద్య, కుటీర పరిశ్రమల (ఎంఎస్‌ఎంఈ) స్థాపనకు, 3 కిలోవ్యాట్‌ల సామర్థ్యం కలిగిన సోలార్ రూఫ్‌టాప్ ఏర్పాటుకు అతి తక్కువ వడ్డీరేట్లకు రుణ సదుపాయం కల్పిస్తామన్నారు. సోలార్‌రూఫ్‌టాప్‌కు రూ.78 వేల వరకు రాయితీ ఉంటుందన్నారు. నేషనల్ పెన్షన్ స్కీం (ఎన్‌పీఎస్) కింద పిల్లల ఆర్థిక భవిష్యత్తు సుస్థిరత కోసం, దీర్ఘకాలంలో సంపద సృష్టించాలనుకునే తల్లిదండ్రుల కోసం నవజాత శిశువుల మొదలు 18 సంవత్సరాలోపు వయసున్న పిల్లల కోసం ఎన్‌పీఎస్ వాత్సల్య కింద ఖాతా తెరవవచ్చన్నారు. సంవత్సరానికి రూ.1000 చెల్లిస్తే చివర్లో ఆర్థిక భరోసా లభిస్తుందన్నారు. ఎక్కడికక్కడ బ్యాంకు శాఖల్లో సంప్రదించి ఏపీజీబీ సేవలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. అనంతరం రీటైల్ పండుగ సందర్భంగా నగరంలో ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో బ్యాంకు సీనియర్ మేనేజర్లు శ్రీధర్, శివకుమార్, అబ్దుల్ మునాఫ్, చైతన్యకుమార్, బ్రాంచి మేనేజర్లు, సిబ్బంది పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

అంతర్జాతీయ ఫిడే రేటింగ్ సాధించిన 'పురం' వాసులు


జ్ఞాపికారెడ్డి


విష్ణు కిరణ్


మిథున్ పెద్దన్న

హిందూపురం టౌన్: బెంగళూరు వేదికగా చెక్ అండ్ మేట్ అకాడమీ ఆధ్వర్యంలో సెప్టెంబర్ 22న జరిగిన చెస్ టోర్నీలో హిందూపురానికి చెందిన క్రీడాకారులు జి.జ్ఞాపిక రెడ్డి, వి.విష్ణు కిరణ్, సి.మిథున్ పెద్దన్న పాల్గొని వరుసగా 1,532, 1,463, 1,455 అంతర్జాతీయ ఫిడే రాపిడ్ రేటింగ్‌ను దక్కించుకున్నారు. ప్రతిభ చాటిన క్రీడాకారులను ఈ సందర్భంగా చెస్ కోచ్ ఆరీఫ్ వుల్లా మంగళవారం అభినందించారు.

90 శాతం సబ్సిడీతో విత్తన పప్పుశనగ పంపిణీ చేయాలి

- ఏపీ రైతు సంఘం డిమాండ్

అనంతపురం అర్బన్: ప్రస్తుత రబీలో 90 శాతం సబ్సిడీతో రైతులకు విత్తన పప్పుశనగ పంపిణీ చేయాలని ఏపీ రైతు సంఘం జిల్లా కమిటీ డిమాండ్ చేసింది. మంగళవారం స్థానిక ఆ శాఖ కార్యాలయంలో జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శి తరిమెల నాగరాజు, ఆర్.చంద్రశేఖర్‌రెడ్డి మాట్లాడారు. 2023లో తీవ్ర వర్షాభావం కారణంగా రైతులు తీవ్రంగా నష్టపోయారన్నారు. అయితే ఇప్పటి వరకూ ప్రభుత్వం బీమా ప్రకటించలేదన్నారు. కనీసం పెట్టుబడి సాయం రూ.20 వేలు కూడా ఇవ్వలేదన్నారు. దీంతో రబీలో పంట సాగుకు రైతులు అప్పు చేయాల్సిన పరిస్థితి నెలకొందన్నారు. ఇలాంటి తరుణంలో ప్రభుత్వం ప్రకటించినట్లుగా 25 శాతం సబ్సిడీతో విత్తన పప్పుశనగ పంపిణీపై చేపడితే రైతులకు ప్రయోజనం ఉండదన్నారు. పప్పుశనగ బయటి మార్కెట్‌లో క్వింటా రూ.7 వేల నుంచి రూ.7,300 వరకు ధర ఉందన్నారు. అయితే ప్రభుత్వం రూ.9,400 ధర నిర్ణయించి 25 శాతం సబ్సిడీ ఇస్తామని చెప్పడం ఒక విధంగా రైతులను మోసగించడమేనని అన్నారు. రైతుల దుస్థితిని గమనించి 90 శాతం సబ్సిడీతో పప్పుశనగ ఇవ్వాలన్నారు. అలాగే రైతు సేవా కేంద్రాల ద్వారా సబ్సిడీతో ఎరువులు, పురుగుమందులు ఇవ్వాలన్నారు.

మృతుడి ఆచూకీ లభ్యం

రాప్తాడు: మండలంలోని గంగలకుంట గ్రామ రైల్వే గేట్ సమీపంలో సోమవారం తెల్లవారుజామున 3 గంటలకు రైలు కింద పడి ఆత్మహత్య చేసుకున్న యువకుడి ఆచూకీని పోలీసులు పసిగట్టారు. వివరాలను ధర్మవరం రైల్వే సీహెచ్‌ఓ షణ్ముఖానందరెడ్డి మంగళవారం వెల్లడించారు. రాయదుర్గం మండలం కెంచానపల్లికి చెందిన పాండు కుమారుడు కళ్యాణ్‌కుమార్ (19) అనంతపురం రూరల్ మండలం ఇటుకులపల్లి సమీపంలోని అనంతలక్ష్మి ఇంజినీరింగ్ కళాశాలలో రెండో సంవత్సరం బీటెక్ చదువుతున్నాడు. ఈ క్రమంలో మొదటి, రెండో సెమిస్టర్‌కు సంబంధించిన సబ్జెక్టులో మిగిలిపోయాయి. ఈ విషయం తల్లిదండ్రులకు తెలిస్తే వారు అవమానంగా భావిస్తారని భావించిన కళ్యాణ్‌కుమార్... జీవితంపై విరక్తితో రైలు కిందపడి ఆత్మహత్య చేసుకున్నాడు. విషయం తెలుసుకున్న తల్లిదండ్రులు ధర్మవరంలోని ఆస్పత్రికి చేరుకుని వెళ్లి కుమారుడి మృతదేహంపై పడి గుండెలవిసేలా రోదించారు.

ప్రభుత్వ ప్రోత్సాహకాలను సద్వినియోగం చేసుకోండి

- పట్టు పరిశ్రమ శాఖ జేడీ పద్మమ్మ


పొలం పిలుస్తోంది కార్యక్రమంలో పాల్గొన్న జేడీ పద్మమ్మ, తదితరులు

నల్లమాడ: ప్రభుత్వం అందిస్తున్న ప్రోత్సాహకాలను సద్వినియోగం చేసుకోవాలని పట్టు రైతులకు ఆ శాఖ సంయుక్త సంచాలకులు పద్మమ్మ సూచించారు. నల్లమాడ మండలం పులగంపల్లి, తోలేటివారిపల్లి గ్రామాల్లో మంగళవారం నిర్వహించిన పొలం పిలుస్తోంది కార్యక్రమంలో జేడీ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ... మల్బరీ సాగు, షెడ్ నిర్మాణానికి ప్రభుత్వం అందిస్తున్న ప్రోత్సాహకాలు, వాటి ప్రయోజనాలపై రైతులను చైతన్య పరిచారు. పశువైద్యులు డాక్టర్ రవీనాయక్ మాట్లాడుతూ.. వర్షాకాలంలో పశువులకు సోకే వ్యాధులు, తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. ప్రత్యామ్నాయ విత్తనాల పంపిణీ, వివిధ పంటల్లో తీసుకోవాల్సిన యాజమాన్య పద్ధతులపై మండల వ్యవసాయాధికారి సుమతి చైతన్య పరిచారు. కార్యక్రమంలో రైతు సేవా కేంద్రాల సహాయకులు, మహిళా రైతులు పాల్గొన్నారు.

శభాష్ మంజమ్మ..



కానిస్టేబుల్ మంజమ్మను అభినందిస్తున్న ఎస్పీ రత్న

పుట్టపర్తి టౌన్/హిందూపురం: జాతీయ స్థాయి పోలీసుల క్రీడల్లో వెయిట్ లిఫ్టింగ్ క్లస్టర విభాగం, యోగా మహిళా పోటీల్లో కాంస్య పతకం సాధించిన మహిళా కానిస్టేబుల్ మంజమ్మను ఎస్పీ రత్న అభినందించారు. మంగళవారం పోలీస్ కార్యాలయంలోని చాంబర్‌లో ఎస్పీని మంజమ్మ కలిశారు. తాను అందుకున్న పతకాన్ని చూపించారు. ఈ సందర్భంగా మంజమ్మను ఎస్పీ రత్న అభినందిస్తూ రివార్డుకు సిఫారసు చేయడంతో పాటు మరిన్ని పతకాలు సాధించి పోలీసు శాఖ ఖ్యాతిని పెంచాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో డీఎస్పీ శ్రీనివాసరావు, సీఐ బాలసుబ్రహ్మణ్యంరెడ్డి, శ్రీనివాసులు, ఆర్‌ఐ వలి, ఎస్‌బీ ఎస్‌ఐ ప్రదీప్‌కుమార్ పాల్గొన్నారు.

యువకుడి దుర్మరణం


భార్గవ్ (ఫైల్)

తనకల్లు: బొలెరోను లారీ ఢీకొన్న ఘటనలో ఓ యువకుడు దుర్మరణం పాలయ్యాడు. పోలీసులు తెలిపిన మేరకు... తనకల్లు మండలం నల్లగుట్లపల్లికి చెందిన శంకరప్ప కుమారుడు భార్గవ్ (25) బొలెరో వాహనం నడుపుతూ కుటుంబానికి చేదోడుగా ఉన్నాడు. ఈ క్రమంలో రైతుల టమాట పంటను సోమవారం లోడ్ చేసుకుని అన్నమయ్య జిల్లా మొలకలచెరువు మార్కెట్‌కు తీసుకెళ్లాడు. అక్కడ టమాట క్రేట్‌లను అన్‌లోడ్ చేసిన తర్వాత సోమవారం అర్ధరాత్రి స్వగ్రామానికి తిరుగు ప్రయాణమయ్యాడు. ఈదులవంక దగ్గరకు చేరుకోగానే ఎదురుగా వేగంగా వస్తున్న లారీ ఢీ కొంది. ఘటనలో బొలెరో నడుపుతున్న భార్గవ్ అక్కడికక్కడే మృతి చెందాడు. బొలెరో ముందు భాగం నుజ్జునుజ్జయ్యింది. ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు.

ప్రమాదంలో వ్యక్తి మృతి


మృతుడు బొమ్మన్న

రాయదుర్గం టౌన్: ద్విచక్ర వాహనాలు పరస్పరం ఢీకొన్న ఘటనలో ఓ వ్యక్తి దుర్మరణం పాలయ్యాడు. ముగ్గురికి తీవ్ర గాయాలయ్యాయి. పోలీసులు తెలిపిన మేరకు.. విడపనకల్లు మండలం పాల్తూరుకు చెందిన రైతు బొమ్మన్న(55), సత్యమ్మ దంపతులు ద్విచక్రవాహనంపై మంగళవారం కర్ణాటకలోని బైరసముద్రం మారెమ్మ గుడి జాతరకు వెళ్లారు. పూజాదికాలు ముగించుకుని తిరుగు ప్రయాణమైన వారు టి.వీరాపురం సమీపంలోకి చేరుకోగానే ఎదురుగా ద్విచక్ర వాహనంపై చాలా వేగంగా వస్తున్న ఆంజనేయులు, గురుస్వామి ఢీకొన్నారు. ఘటనలో బొమ్మన్న అక్కడికక్కడే మృతి చెందాడు. సత్యమ్మతోపాటు ఆంజనేయులు, గురుస్వామికు తల, ఇతర భాగాలకు తీవ్ర గాయాలయ్యాయి. వీరిని 108 అంబులెన్స్‌లో తొలుత రాయదుర్గంలోని ప్రభుత్వాస్పత్రికి తీసుకెళ్లారు. ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం అనంతపురానికి తరలించారు. సత్యమ్మ పరిస్థితి విషమంగా ఉన్నట్లు వైద్యులు తెలిపారు. ఘటనపై రాయదుర్గం పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు.

అత్యాచారం కేసులో నిందితుడి అరెస్ట్


నిందితుడిని అరెస్ట్ చూపుతున్న పోలీసులు

తాడిమర్రి: యువతిపై అత్యాచారం చేసిన కేసులో నిందితుడిని అరెస్ట్ చేసినట్లు సీఐ శ్యామరావు తెలిపారు. మంగళవారం తాడిమర్రి పీఎస్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. తాడిమర్రి మండలంలోని ఓ గ్రామానికి చెందిన 19 ఏళ్ల వయసున్న యువతి ఈ నెల 29న రాత్రి బహిర్భూమికి వెళ్లిన ఆ సమయంలో అదే గ్రామానికి చెందిన డేరంగుల నరసింహులు అత్యాచారం చేశాడన్నారు. యువతి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు నార్సింపల్లి వద్ద నిందితుడిని గుర్తించి మంగళవారం అరెస్ట్ చేసి, న్యాయస్థానంలో హాజరు పరిచినట్లు తెలిపారు.

వివాహిత ఆత్మహత్య

అనంతపురం/రాప్తాడురూరల్: కుటుంబ కలహాల నేపథ్యంలో ఓ వివాహిత ఆత్మహత్య చేసుకుంది. పోలీసులు తెలిపిన మేరకు... బుక్కరాయసముద్రం మండలం దండువారిపల్లికి చెందిన ఉజ్జినప్పకు అనంతపురం రూరల్ మండలం కందుకూరు గ్రామానికి చెందిన శ్రీలక్ష్మి (33)తో 14 ఏళ్ల క్రితం వివాహమైంది. వీరికి ఓ కుమార్తె ఉంది. ఎస్కేయూలో సెక్యూరిటీ గార్డ్‌గా పని చేస్తూ కుటుంబాన్ని ఉజ్జినప్ప పోషించుకుంటున్నాడు. కొంతకాలంగా దంపతుల మధ్య మనస్పర్థలు తలెత్తడంతో తరచూ గొడవ పడేవారు. మంగళవారం ఉదయం మరోమారు గొడవ పడిన అనంతరం భర్త డ్యూటీకి వెళ్లాడు. కాసేపటి తర్వాత కుమార్తెను స్కూల్‌కు పంపిన శ్రీలక్ష్మి... ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఫ్యాన్‌కు ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకుంది. సాయంత్రం విధులు ముగించుకుని ఇంటికి చేరుకున్న భర్త పలుమార్లు పిలిచినా వాకిలి తీయకపోవడంతో అనుమానం వచ్చి కిటికీ ద్వారా లోపలకు చూశాడు. అప్పటికే ఉరికి విగతజీవిగా వేలాడుతున్న భార్యను గమనించి, చుట్టుపక్కల వారి సాయంతో తలుపులు బద్దలుగొట్టి లోపలకు ప్రవేశించాడు. శ్రీలక్ష్మిని కిందకు దించి ఆస్పత్రికి తీసుకెళ్లారు. పరీక్షించిన వైద్యులు అప్పటికే ఆమె మృతి చెందినట్లు నిర్ధారించారు. ఘటనపై శ్రీలక్ష్మి తల్లిదండ్రులు అనుమానాలు వ్యక్తం చేస్తూ ఫిర్యాదు చేయడంతో ఆ దిశగా ఇటుకలపల్లి పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు.